సాక్షి
ప్రకాశం

బుధవారం । 16 । ఏప్రిల్ । 2025



రైతును ముంచిన బాబు

రైతుల సమస్యలు పరిష్కరించకుండా చంద్ర బాబు మోసగించాడని వైఎస్సార్ సీపీ ఒంగోలు ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు అన్నారు.

- 8లో..



పట్టపగలే ఇల్లు లూటీ

పట్టపగలే ఓ ఇంట్లో దొంగలు పడి భారీ మొత్తంలో బంగారం, వెండి నగలు, నగదు అపహరించిన ఘటన కంభం మండలం పోరుమామిళ్లపల్లిలో జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
38 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

20న నీట్ మోడల్ పరీక్ష



నీట్ మోడల్ పరీక్ష పోస్టర్‌ను విడుదల ఆవిష్కరిస్తున్న డాక్టర్ శ్రీనాథ్

ఒంగోలు టౌన్: భారత ప్రజాతంత్ర సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి నీట్ మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కేఎఫ్ బాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం నీట్ మోడల్ పరీక్ష పోస్టర్‌ను ఒక ప్రైవేటు వైద్యశాలలో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు పి.శ్రీనాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ.. నీట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టేందుకు మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో 1, 2, 3 ర్యాంకులు వచ్చిన వారికి మెమొంటోలు అందజేయడానికి అభినందన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంస్థల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టి.భాను, హేమంత్, సుశాంత్, హిదాయత్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డీసీఓగా ఇందిరా దేవి



కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీసీఓ ఎస్.ఇందిరా దేవి

ఒంగోలు సబర్బన్: జిల్లా సహకార అధికారిగా ఎస్.ఇందిరా దేవి బాధ్యతలు చేపట్టారు. ఆమె ప్రస్తుతం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (పీడీసీసీబీ)లో డిప్యూటీ రిజిస్ట్రార్ ఓఎస్‌డీగా విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా సహకార అధికారిగా పనిచేస్తున్న శ్రీనివాసులు రెడ్డిని రాష్ట్ర కార్యాలయానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఉత్తర్వులు ఇచ్చారు. దాంతో జిల్లా సహకార అధికారి పోస్టు ఖాళీ ఏర్పడింది. పీడీసీసీబీలో పనిచేస్తున్న ఇందిరా దేవికి పూర్తి అదనపు బాధ్యతలతో జిల్లా సహకార అధికారిగా నియమించారు. దాంతో మంగళవారం కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను మర్యాద పూర్వకంగా ఇందిరా దేవి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఉపాధి హామీ పనులను కలెక్టర్ తనిఖీ



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

చీమకుర్తి రూరల్: మండలంలోని పడమటి నాయుడుపాలెం గ్రామంలో ఉపాధి హామీ కింద చేపట్టిన నీటి కుంటల పనులను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. కూలి ఎంత వస్తోందని తెలుసుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పడమటి నాయుడు పాలెం గ్రామంలోని సచివాలయంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతి పిల్లవానికి పౌష్టికాహారం అందించాలన్నారు. పిల్లలకు పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించేందుకు పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల బరువు, ఎత్తు వివరాలు తీసుకుని ఏ విధమైన గ్రేడ్లో ఉన్నారో గుర్తించి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న పౌష్టికాహారం అందించాలన్నారు. పోషకాహార లోపం, రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పీడీ జోసెఫ్ కుమార్, ఇన్చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీ ఏపీఓ రాఘవ, ఎంఈఓ శివాజీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పిచ్చమ్మ, దేవసేన, ప్రమీల, సచివాలయ సిబ్బంది అంగన్‌వాడీ వర్కర్లు, అంగన్‌వాడీ ఆయాలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పొగ పట్టిన ధర!

పొగాకు పగాకుగా మారింది. వేలం కేంద్రాల్లో ధరలు చూసి రైతు గుండె గుభేల్‌మంటోంది. నాలుగేళ్ల పాటు లాభాలు ఆర్జించిన రైతుకు నేడు కష్టకాలం ఎదురవుతోంది. కనీసం ఖర్చులైనా వస్తాయా అన్న దీన స్థితిలో పడిపోయాడు. బయ్యర్లు, దళారులు నిట్టనిలువునా ముంచేస్తున్నా బోర్డు అధికారులు చోద్యం చూస్తుండడంతో రైతుల ముఖం పొగచూరిపోతోంది. పెట్టుబడిపోనూ నాలుగురాళ్లు వెనకేసుకుందామని అనుకున్న రైతన్నకు ఊహించని షాక్ తగులుతోంది. బేళ్లు యార్డుకు తీసుకురావడం.. వెనక్కి తీసుకెళ్లడంతో తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. ప్రభుత్వం సైతం రైతు కష్టాలను పట్టించుకోకపోవడంతో వీరికి నిరాశ మిగులుతోంది.



పొగాకు వేలం కేంద్రం

- వేలం కేంద్రాల్లో పతనమవుతున్న పొగాకు ధరలు
- దిక్కుతోచని స్థితిలో పొగాకు రైతు
- పొగాకు కేజీ ధర రూ.240 మాత్రమే
- ప్రతిరోజు 150 వరకు వేలం నుంచి వెనక్కి వెళుతున్న బేళ్లు
- తగ్గిన దిగుబడి, వెనక్కి వస్తున్న బేళ్లతో ఆర్థికంగా భారం పడుతోందని బేజారు
- ధర లేకపోవడంతో కోల్డ్‌స్టోరేజీలకు తరలిస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న బోర్డు అధికారులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

సాక్షిప్రతినిధి, ఒంగోలు: పొగాకు వేలం కేంద్రాల్లో ఈ ఏడాది ఆరంభ ధరలు చూసి రైతు సంబరపడ్డాడు. గత ఏడాదిలాగే ఈసారి కూడా లాభాలు మూటగట్టుకోవచ్చు అని ఆశపడ్డాడు. అయితే తాజా పరిస్థితులు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. నాలుగేళ్లు లాభాలు చూసిన రైతు నేడు నష్టాల ఊబిలో కూరుకుపోయే దుస్థితి నెలకొంది. ప్రకాశం రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాల్లో సుమారు 30 వేల మంది రైతులు పొగాకు సాగు చేస్తున్నారు. పొగాకు బోర్డు ఈ ఏడాది 68,500 హెక్టార్లలో సాగుకు అనుమతి ఇవ్వగా పరిమితికి మించి 88 వేల హెక్టార్లలో సాగు చేశారు. బోర్డు అనుమతి ఇచ్చిన పంట ఉత్పత్తి పరిమాణం సుమారు 105.27 మిలియన్ కిలోలు ఉండగా పంట ఉత్పత్తి అంచనా సుమారు 162 మిలియన్ కిలోలుగా నిర్ణయించారు.

వేలం కేంద్రాల్లో తిరకాసు:

రీజియన్ పరిధిలో గత నెల 10వ తేదీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. తొలి రోజు కిలో ధర అత్యధికం రూ.280, అత్యల్పం రూ.278 పలికింది. ఇంకా కర్ణాటకలో కొనుగోళ్లు జరుగుతుండడం అక్కడ మంచి ధరలు రావడంతో ఈ ప్రాంత రైతులు ఆశలు పెట్టుకున్నారు. అక్కడ బ్రైట్ పొగాకు ధర రూ.337 పలికింది. సరాసరి రూ.268 ఉండడంతో ఈ సారి ఖర్చులు పెరిగినా గట్టెక్కొచ్చు అని భావించారు. కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయన్న తరుణంలో దళారులు, బయ్యర్లు కుమ్మక్కయ్యారు. నాణ్యత పేరుతో దొంగాట మొదలెట్టారు. వేలం కేంద్రాలకు వచ్చిన వాటిలో 10 శాతం వాటికి మాత్రమే అత్యధిక రేటు అంటే రూ.280 చెల్లిస్తూ మిగతా వాటికి వారు ఇష్టమొచ్చిన రేటుకు తీసుకుంటున్నారు. మంగళవారం టంగుటూరు కేంద్రంలో జరిగిన కొనుగోళ్లను పరిశీలిస్తే ఏ స్థాయిలో దోపిడీ జరుగుతోందో తెలుస్తోంది. టంగుటూరు కేంద్రంలో కేజీ ధర రూ.225. కేవలం 10 శాతం బేళ్లకు మాత్రమే రూ.280 ధర ఇచ్చి మిగతా బేళ్లని సరాసరి రూ.240 కి కొనుగోలు చేస్తున్నారు. ఇదే విధంగా అన్ని కేంద్రాల్లో జరుగుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేలం కేంద్రానికి తీసుకుని వెళ్లిన పొగాకు బేళ్లు ఏనాడూ ఒక్కటి కూడా వెనక్కి వచ్చిన దాఖలాలు లేవు. ఈదఫా ప్రతిరోజు వేలం కేంద్రాన్ని బట్టి సుమారు 20 శాతం బేళ్లు వెనక్కి తిరిగి వస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. బేళ్లు వెనక్కు తీసుకువస్తుండడంతో రవాణా ఖర్చుల భారం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా రైతుల బాగోగులు చూడాల్సి పొగాకు బోర్డు అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పొగాకు కొనుగోళ్లు ప్రారంభమై ఇప్పటికి 45 రోజులు కావస్తోంది. ఇప్పటి వరకూ 9.2 మిలియన్ కేజీల పొగాకును మాత్రమే కొనుగోలు చేసినట్టు బోర్డు అధికారుల చెబుతున్నారు.

కోల్డ్ స్టోరేజీలకు..

ప్రస్తుతమున్న పరిస్థితుల్లో రైతులు పొగాకును కోల్డ్ స్టోరేజిల్లో నిల్వచేస్తున్నారు. మంచి ధర కోసం ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న దాదాపు అన్ని కోల్డ్ స్టోరేజీలు పొగాకు బేళ్లతో నిండిపోయాయని తెలుస్తోంది. అయితే బోర్డు అధికారుల వాదన భిన్నంగా ఉండడం గమనార్హం. ఈసారి ఎండతీవ్రత బాగా ఉండటంతో రైతులు నాణ్యమైన పొగాకు బేళ్లను గ్రేడ్ చేసి మరీ కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేశారని అంటున్నారు. వాస్తవానికి ప్రతి సంవత్సరం పొగాకు బేళ్లను కట్టిన తరువాత సుమారు నెల రోజుల పాటు నిల్వ చేసి తరువాత వేలం కేంద్రానికి తీసుకుని వచ్చేవారు. దీనిని పరిశీలించిన కొనుగోలుదారులు పొగాకు నాణ్యతను పరిశీలించి ధర నిర్ణయించేవారు. ప్రస్తుతం ఆశించిన మేరకు ధరలు రాక రైతు ఆందోళన చెందుతున్నాడు.

పెరిగిన ఖర్చులు, తగ్గిన దిగుబడి

ప్రతి సంవత్సరం ఒక ఎకరాకు సుమారు 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ఈ సంవత్సరం తెగుళ్ల, వాతావరణ పరిస్థితుల కారణంగా కేవలం ఆరు నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. అంతేకాక ఎకరాకు సుమారు రూ.2.50 లక్షల వరకు ఖర్చయిందని రైతులు చెబుతున్నారు. పెరిగిన ఖర్చులకు తగ్గట్లుగా ఈసారి ధరలు లేవని, ప్రస్తుతమున్న ధరలను పరిశీలిస్తే భయమేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ధరల ప్రకారం అమ్మకాలు జరిగితే పొలం ఉన్న రైతుకు రూ.50 వేలు, కౌలు రైతుకు రూ.90 వేలు ఎకరాకు నష్టం వచ్చే పరిస్థితులు ఉన్నాయని రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

రోజూ 30 నుంచి 100 బేళ్లు వెనక్కు..

జిల్లాలో వేలం కేంద్రాల నుంచి ప్రతిరోజు 30 నుంచి 100 వరకు పొగాకు బేళ్లు వెనక్కి వెళుతున్నాయి. రైతులు నాణ్యమైన పొగాకు బేళ్లను కేంద్రానికి తీసుకుని రాకపోవటమే కారణం. అంతేకాక బేళ్లు కట్టిన తరువాత సుమారు నిల్వ ఉంచిన బేళ్లను మాత్రమే కేంద్రానికి తీసుకుని రావాలి. కానీ నాలుగురోజుల్లోనే బేళ్లను కేంద్రానికి తీసుకుని వస్తున్నారు. దీంతో నాణ్యత లేక బేళ్లు వెనక్కి తిరిగి పంపిస్తున్నాం.

– ఎం లక్ష్మినారాయణ, పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్

ఎకరాకు రూ.40 వేలు నష్టం



నేను 30 ఎకరాల్లో పొగాకు సాగు చేశాను. ఈ సారి సాగు ఖర్చులు బాగా పెరిగాయి. ఎకరాకు రూ.2.10 లక్షలు ఖర్చయింది. ఎకరాకు ఏడు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రస్తుతమున్న ధరల ప్రకారం ఎకరాకు రూ.1.70 లక్షలు మాత్రమే వస్తుంది. ఈ ప్రకారం ఎకరాకు సుమారు రూ.40 వేలు నష్టపోతాను. అదే కౌలు రైతు అదనంగా కౌలుతో కలిపి రూ.80 వేలు నష్టపోయే అవకాశం ఉంది.

– పిన్నిక శ్రీనివాసులు, పొగాకు రైతు, పంగులూరువారిపాలెం

అండగా నిలిచిన జగన్..

గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముందు చూపుతో పొగాకు రైతుకు అండగా నిలిచారు. బయ్యర్లు, దళారుల మాయాజాలంలో రైతులు చిక్కుకోకుండా మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి ఆదుకున్నారు. ఫలితంగా నాలుగేళ్ల పాటు రైతుకు లాభాల పంట పండింది. వ్యాపారులు పోటీ పడి కొనుగోలు చేయడంతో పొగాకు బంగారంగా మారిపోయింది. నేడు కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. లాభాల సంగతి దేవుడెరుగు పెట్టిన పెట్టుబడికి సరైన గిట్టుబాటు ధర లేక తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పొగాకు రైతుల పాలిట పగాకు గా మారుతోందని రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

సూపర్ సిక్స్‌పై చేతులెత్తేసిన బాబు



వైఎస్సార్ సీపీ ప్రభపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, పక్కన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ



భారీగా తరలివచ్చిన జనం

- సుపరిపాలన వైఎస్ కుటుంబానికే సాధ్యం
- 2029లో అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీనే
- చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ

తాళ్లూరు: సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో విఫలమైన చంద్రబాబు చేతులెత్తేశాడని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. గుంటి గంగమ్మ జాతర సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ప్రభలపై ఎమ్మెల్యేతో పాటు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరయ్యారు. ముందుగా గంగమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారిని శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. విద్యుత్ ప్రభపై గుంటి గంగమ్మ తల్లి జాతర సందర్భంగా వారు నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా, వాలంటీర్ వ్యవస్థ కొనసాగిస్తానని చెప్పి రూ.10 వేల జీతం అందిస్తానని చంద్రబాబు మోసగించారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సీఎంగా గెలిపించుకోవాలని, ఇది ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుల బాధ్యత అన్నారు.

బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ దర్శి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రతి ఒక్క కార్యకర్తకు, పార్టీ నాయకులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. చంద్రబాబు ఓడిపోతాడన్న భయంతోనే ఉమ్మడిగా వచ్చి మోసపూరితమైన మాటలు ప్రజలకు చెప్పి గెలిచారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేయడం వైఎస్ కుటుంబానికే సాధ్యమని, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. 2029 ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విజయం సాధిస్తారని చెప్పారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ నాడు-నేడు పథకం అమలు చేసి పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు అమలు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రెండు విద్యుత్ ప్రభలు

మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో కలిసి ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి సినీతార హెబ్బాపటేల్ ను ఆహ్వానించారు. విద్యుత్ ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రభల వద్దకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు తూము వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు పోశం మధుసూదన్ రెడ్డి, ఐవీ సుబ్బారెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, సర్పంచులు కోట శివలక్ష్మి రామిరెడ్డి, చిమట సుబ్బారావు, షేక్ వలి, పులి ప్రసాద్ రెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఆదం షరీఫ్ (బుజ్జి), గంగమ్మ తల్లి దేవస్థానం మాజీ చైర్మన్ కె.శ్రీనివాసరావు, నియోజకవర్గ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు జక్కుల రామకృష్ణ, ప్రచార విభాగం అధ్యక్షుడు యత్తపు మధుసూదన్ రెడ్డి, అడ్వొకేట్ నాగమల్లేశ్వర్ రెడ్డి, గుజ్జుల యోగిరెడ్డి, గుజ్జుల వెంకటేశ్వర రెడ్డి (గోల్డ్), గూడా గోపాల్ రెడ్డి, కుమ్మిత జయరామి అనిల్ రెడ్డి, గోపు శ్రీనివాస్ రెడ్డి, గుజ్జుల తిరుపతిరెడ్డి, పల్లెబోయిన శ్రీనివాస రెడ్డి, సయ్యద్ లతీఫ్, షేక్ వలి, పునూరి దేవదానం, వేమర్తి ప్రభుదాస్, కై పు అశోక్ రెడ్డి, గువ్వల శ్రీనివాస్ రెడ్డి, కూలూరి అంజిరెడ్డి, సంగు కొండా రెడ్డి, సయ్యద్ సైదా, కోటా కృష్ణారెడ్డి, పులి రమణారెడ్డి, బాలనాగిరెడ్డి, కోటా కృష్ణారెడ్డి, హరిబాబు, బ్రహ్మయ్య, శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ ప్రభపై సందడి చేస్తున్న సినీ తార హెబ్బాపటేల్

లక్ష్యాల మేరకు రుణాలు అందించాలి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

- ఎస్సీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలి
- బ్యాంకర్స్ సమావేశంలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాల కింద బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా బ్యాంకర్లకు సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025–26 కింద ఓబీఎంఎంఎస్ స్వయం ఉపాధి పథకం అమలుపై ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించాలని కలెక్టర్ కోరారు. ఎస్సీ పేద వర్గాల ప్రజల అభ్యున్నతికి తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ బ్యాంకర్లను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తుల ఆర్థిక సాధికారతను పెంచి, స్వయం ఉపాధిని ప్రోత్సహించడానికి ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025–26ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందన్నారు. మొత్తం రూ.54.60 కోట్లతో జిల్లాకు 1,305 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. ఇందులో రూ.21.58 కోట్లు సబ్సిడీ కాగా రూ.30.29 కోట్లు బ్యాంకు రుణమని, మిగిలిన మొత్తం లబ్ధిదారులు కట్టాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025–26 కింద బ్యాంకు బ్రాంచ్‌ల వారీగా, మండలాల వారీగా రుణ లక్ష్యాలను నిర్దేశించారన్నారు. ఎస్సీ యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో సైట్ ఓపెన్ చేశారని, మే నెల 13వ తేదీ వరకు నెల రోజుల పాటు ఆన్‌లైన్‌లో అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ఎల్‌డీఎం రమేష్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేల విజేత బేస్తవారిపేట ఎడ్లు

హనుమంతునిపాడు: మండలంలోని నందనవనం పంచాయతీ మంగమ్మపల్లిలో వెలసిన మంగమ్మ, గరటయ్య స్వామి తిరునాళ్ల సందర్భంగా ఈనెల 12వ తేదీ నుంచి నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు మంగళవారంతో ముగిశాయి. సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు జరిగాయి. సీనియర్ విభాగంలో మొదటి బహుమతి రూ.50 వేలను బేస్తవారిపేట మండలం ఖాజీపేటకు చెందిన వేగినాటి ఓసూరారెడ్డి ఎడ్ల జత గెలుచుకుంది. రెండో బహుమతి రూ.40 వేలను రాచర్ల మండలం ఆకవీడుకు చెందిన పూజితారెడ్డి ఎడ్ల జత సాధించింది. మూడో బహుమతి రూ.30 వేలను బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన కొత్తకోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లజత అందుకుంది. నాలుగో బహుమతి రూ.25 వేలను కడప జిల్లా కలశపాడుకు చెందిన బేతి వెంకటరెడ్డి ఎడ్ల జత గెలుపొందింది. ఐదో బహుమతి రూ.20 వేలను కృష్ణా జిల్లా నాగాయలంక మండలం తలగడదీవికి చెందిన బోగాది వెంకట బసవయ్య ఎడ్ల జత గెలుచుకుంది.



వలస కార్మికులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

వలస కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కొత్తపట్నం: వలస కార్మికులపై ప్రత్యేక దృష్టి సారించి.. వారు ఆరోగ్యంగా ఉండేలా వైద్య సిబ్బంది చూసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టీ వెంకటేశ్వర్లు ఆదేశించారు. అల్లూరు గ్రామం ఆర్ఆర్ కాలనీలో ఉన్న వలస కార్మికులను మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతుంటే సమీప ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలన్నారు. అనంతరం ఆయన వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మధుమేహం, రక్తపోటు పరీక్షలు, హెచ్‌బీ పరీక్షలను నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆధార్ కార్డులు లేని వలస కార్మికులకు వెంటనే ఆధార్ నమోదు చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీపీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రావణ్, కొత్తపట్నం పీహెచ్ డాక్టర్ నవ్యదీపిక, ఎంఎల్‌హెచ్‌పీ బత్తుల భారతి, ఏఎన్ఎం సుభాషిణి, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఒడా సెక్రటరీగా చండీ దేవసేన

- పొదిలి కమిషనర్‌గా కేఎల్ఎన్ రెడ్డి

ఒంగోలు సబర్బన్: ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) సెక్రటరీగా ఆర్.చండీ దేవసేనను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ కమిషనర్ గ్రేడ్–2 హోదాలో ఉన్న ఆమె ఇప్పటి వరకు రాష్ట్ర కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్నారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో సెక్రటరీ పోస్టు ఖాళీగా ఉంది. ఖాళీగా ఉండటంతో ప్రస్తుతం జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఇన్‌చార్జ్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఖాళీగా ఉన్న పొదిలి మున్సిపల్ కమిషనర్‌గా కేఎల్ఎన్ రెడ్డిని నియమించారు. ఈయన కర్నూలు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ పదోన్నతి పొంది బదిలీపై పొదిలి వస్తున్నారు.

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన పీటీసీ డీఎస్పీ


ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న పీటీసీ డీఎస్పీ సుందరరావు

ఒంగోలు టౌన్: సాధారణ బదిలీల్లో భాగంగా పోలీసు ట్రైనింగ్ కాలేజీ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎం.బాలసుందరరావు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పీటీసీ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సుందరరావును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

గుంటి గంగ ఆలయ ఆదాయం రూ.7.42 లక్షలు


గుడి ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

తాళ్లూరు: మండలంలోని గుంటి గంగ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా వివిధ రూపాల్లో భక్తుల నుంచి వచ్చిన ఆదాయం సుమారుగా రూ.7.42 లక్షలని ఈవో గుంటపల్లి వాసు మంగళవారం తెలిపారు. అందులో టికెట్ల అమ్మకం ద్వారా రూ.92 వేలు, విరాళాల ద్వారా రూ.1.22 లక్షలు, హుండీల ద్వారా రూ.5.27 లక్షల ఆదాయం వచ్చినట్లు వివరించారు. హుండీల ఆదాయాన్ని జే.పంగులూరు గ్రూపు దేవస్థానాల కార్యనిర్వహణాధికారి యూ.శ్రీనివాసరావు పర్యవేక్షణలో లెక్కించారు. ఆలయ ఈవో గుంటపల్లి వాసు, చైర్మన్ గురుబ్రహ్మం, ఆర్‌పీ కె.ప్రసాద్‌రావు, పూజారి కామేశ్వర్ శర్మ, ఆలయ అర్చకులు మెట్టిల బాలరాజు, పి.విజయలక్ష్మి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బధిరుల టీ20 టీమ్ వైస్ కెప్టెన్‌గా మాబువలి



తర్లుపాడు: ఆంధ్రప్రదేశ్ బధిరుల టీ20 క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్‌గా తర్లుపాడు మండలంలోని కేతగుడిపి గ్రామానికి చెందిన దూదేకుల మాబువలి ఎంపికయ్యాడు. గత వారం భీమవరంలో నిర్వహించిన జోన్ స్థాయి పోటీల్లో ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల టీమ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మాబువలిని వైస్‌కెప్టెన్‌గా నియమిస్తూ బధిరుల క్రికెట్ సంఘం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఓ లేఖను మాబువలికి పంపింది. ఈనెల 19 నుంచి గురుగ్రామ్‌లో నిర్వహించనున్న 8వ జాతీయ స్థాయి బధిరుల క్రికెట్ టీమ్‌కు మాబువలి వైస్ కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహించనున్నారు.

రైతును ముంచిన బాబు

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి రవిబాబు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలోని రైతుల సమస్యలు పరిష్కరించకుండా చంద్రబాబు మొద్దనిద్ర నటిస్తున్నారని, టీడీపీ ఎమ్మెల్యేలు మేల్కొని ముఖ్యమంత్రి చంద్రబాబును నిద్రలేపాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు హితవు పలికారు. రైతులు రాజకీయపార్టీలకు చందాలు ఇవ్వరని, అందుకే ఆయన వారిని నిర్లక్ష్యం చేస్తున్నారని, చందాలు ఇచ్చే వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ రైతుల పక్షమైతే టీడీపీ వ్యాపారుల పక్షమని స్పష్టం చేశారు. మంగళవారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒట్టి మాటలకు మాత్రమే పరిమితమైన కూటమి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతోందని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ హయాంలో రాష్ట్రంలో మిర్చి ధర క్వింటాకు రూ.25 వేల వరకు ఉంటే కూటమి పాలనలో ఈ ఏడాది 11,750 రుపాయలు మాత్రమేనన్నారు. ప్రస్తుతం రైతులు క్వింటా మిర్చిని 7 నుంచి 10 వేల రుపాయలకు విక్రయిస్తున్నారని, దీంతో తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. కోల్డ్ స్టోరేజీలో దాచుకునేందుకు డబ్బులు లేక తీసుకొచ్చిన అప్పుల తాలూకా వడ్డీలు చెల్లించలేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకునేందుకు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పొగాకు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. ఈ ఏడాది అతిగా కురిసిన వర్షాల కారణంగా ఒకటికి మూడుసార్లు పొగాకు పంట వేశారని తెలిపారు. ఎకరాకు 10 క్వింటాళ్లు రావాల్సి ఉండగా 6 నుంచి 7 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చిందని చెప్పారు. ఎక్కువ దిగుబడి వచ్చిందని సాకులు చెబుతూ వ్యాపారులు దోపిడీకి తెరదీశారని, రైతులను మానసికంగా దెబ్బతీయడం ద్వారా అనివార్యంగా తక్కువ ధరకు పొగాకు విక్రయించేలా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. నాడు జగనన్న ప్రభుత్వం 200 కోట్ల రుపాయలు కేటాయించి పొగాకు రైతులను ఆదుకున్న విషయాన్ని ఈ సందర్భంగా చుండూరి గుర్తు చేశారు. జిల్లాలో పొగాకు రైతులు నష్టపోతుంటే ఎమ్మెల్యేల కంటికి కనిపించడం లేదన్నారు. జగనన్న హయాంలో 3 వేల కోట్ల రుపాయలతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి రైతులకు భరోసా ఇచ్చారని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ సంస్థలతో పోటీ పడి కందులు కొనుగోలు చేసి రేషన్ షాపుల ద్వారా ప్రజలకు పంపిణీ చేసిందని చెప్పారు. అనుభవం ఉన్న ముఖ్యమంత్రిగా చెప్పుకునే చంద్రబాబు పాలనలో ప్రజలకు కందిపప్పు ఇవ్వడం లేదన్నారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఆక్వా రైతులకు ఎన్నో హామీలు ఇచ్చారని, అనేక వరాలు ప్రకటించారని గుర్తు చేశారు. 1.50 రుపాయలకే విద్యుత్ సరఫరా చేస్తామని, ట్రూ అప్ చార్జీలు రద్దు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. గత ప్రభుత్వం 10 ఎకరాల్లోపు రైతులందరికీ 1.50 విద్యుత్ ఇచ్చిందని, కరోనా సమయంలో ఆక్వా రైతులు నష్టపోకుండా కిలో 220 రుపాయలకు తగ్గకుండా రేటు నిర్ణయించిందని, దాంతో రైతులు నష్టపోకుండా ఆదుకున్నట్లయిందని వివరించారు. ప్రస్తుతం వ్యాపారులు అమెరికా సుంకాలు పెంచిందని, ప్రభుత్వం సహకారం లేదని సాకులు చెబుతూ ఆక్వా రైతులను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. రైతుల సమస్యలపై ఉద్యమించేందుకు వైఎస్సార్ సీపీ సిద్ధమవుతోందని చుండూరి హెచ్చరించారు.

భూ కబ్జాలపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి

కేశవరాజు కుంటలోని ప్రభుత్వ స్థలాల కబ్జా విషయంలో ఎమ్మెల్యే దామచర్ల సమాధానం చెప్పాలని చుండూరి డిమాండ్ చేశారు. కేశవరాజు కుంటలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారని తెలిపారు. అక్కడ ఇప్పటి వరకు 5.60 ఎకరాల స్థలాన్ని కబ్జా చేశారని, మరో రెండు ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో భూ కబ్జాలపై సిట్ వేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఇటీవల అగ్రహారం వద్ద 1.10 ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించగా వైఎస్సార్ సీపీ నాయకులు అడ్డుకున్నారని చుండూరి తెలిపారు. సమావేశంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, నగర కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్ ఖాన్, మండల పార్టీ అధ్యక్షుడు మన్నె శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గుత్తికొండ నారపురెడ్డి పాల్గొన్నారు.

శేష వాహనంపై చెన్నకేశవస్వామి



మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు రంగరంగ వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం రాత్రి శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి వారు కాళియమర్దన అలంకారంలో శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారిని వేద పండితులు ప్రత్యేకంగా అలంకరించి మాఢ వీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకుడు అప్పనాచార్యులు బృందం ఉభయ దేవేరులను ఉత్సవ పీఠంపై ప్రతిష్ఠించి అర్చన, నివేదన, మంగళహారతి ఇచ్చారు. ఉభయదాతలుగా జి.కూర్మయ్య కుటుంబ సభ్యులు వ్యవహరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈఓ జి.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు. బుధవారం రాత్రి చెన్నకేశవ స్వామివారు వ్యాలి వాహనంపై వామన అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

పట్టపగలే ఇల్లు లూటీ

- 70 గ్రాముల బంగారు, 300 గ్రాముల వెండి నగలు, రూ.2 లక్షల నగదు అపహరణ


చోరీ జరిగిన గృహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

కంభం: పట్టపగలే ఓ గృహంలో దొంగలు పడి భారీ మొత్తంలో బంగారు, వెండి నగలతోపాటు నగదు అపహరించారు. ఈ సంఘటన కంభం మండలంలోని పోరుమామిళ్లపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. చిన్నకంభం పంచాయతీ పరిధిలోని పోరుమామిళ్ల గ్రామంలో నివాసం ఉంటున్న మారాబత్తుని చంద్రశేఖర్ కంభంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో ఉద్యోగం చేస్తున్నారు. మంగళవారం ఉదయం చంద్రశేఖర్ స్కూల్‌కు వెళ్లారు. ఆయన భార్య సాయిలక్ష్మి తన చెల్లెలితో కలిసి గిద్దలూరులో ఆర్మీ క్యాంటీన్‌కు, తండ్రి పొలం వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం చంద్రశేఖర్ తండ్రి పొలం నుంచి ఇంటికి వచ్చేసరికి మెయిన్ గేటు తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూడగా తాళం పగలగొట్టి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించారు. బీరువాలోని వస్తువులు మొత్తం చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. 7 తులాల బంగారు ఆభరణాలు, 300 గ్రాముల వెండి నగలు, రూ.2 లక్షల నగదు అపహరణకు గురైనట్లు చంద్రశేఖర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై నరసింహారావు పరిశీలించి వివరాలు సేకరించారు. మార్కాపురం నుంచి క్లూస్ టీమ్ ను రప్పించి వేలిముద్రలు, ఇతర ఆధారాలు సేకరించారు. కంభం -గిద్దలూరు రహదారి పక్కనే ఉన్న ఇంట్లో చోరీకి తెగబడటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

గడ్డివామి దగ్ధం

ముండ్లమూరు (కురిచేడు): వరిగడ్డి వామి దగ్ధమై సుమారు రూ.1.50 లక్షల మేరకు నష్టం జరిగింది. ఈ సంఘటన మండలంలోని పసుపుగల్లులో మంగళవారం జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన గొంది లక్ష్మీరెడ్డి వరిగడ్డి వామి దగ్ధమైంది. ఆరు ఎకరాల్లోని వరిగడ్డి వామి నుంచి పొగలు వస్తుండటంతో గమనించిన స్థానికులు లక్ష్మీరెడ్డికి సమాచారం అందించారు. దర్శి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలు అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసింది. మంటలు పక్కన ఉన్న ఇతర వాములకు వ్యాపించకుండా అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వేసవి కాలం మూగజీవాలకు తిండికోసం దాచిన గడ్డివామి అగ్నికి ఆహుతి కావడంతో రైతు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నాడు. మళ్లీ సుమారు లక్షన్నర రూపాయలు పెట్టినా అంత గడ్డి లభించే పరిస్థితి లేదని, మూగజీవాలకు ఎలా గడ్డి ఏర్పాటు చేయాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అధికారులు స్పందించి తనకు సాయం చేయాలని రైతు లక్ష్మీరెడ్డి వేడుకుంటున్నాడు.

కాశీ వెళ్తే.. ఇల్లు దోచేశారు!

సింగరాయకొండ: మండల కేంద్రం సింగరాయకొండలోని బైరాగిమాన్యంలో ఓ ఇంటిని దొంగలు దోచేసిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. బైరాగిమాన్యంలో నివాసం ఉంటున్న రాజు సుబ్బారెడ్డి ఈ నెల 5వ తేదీన తమ కుటుంబ సభ్యులతో కలిసి కాశీ వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి చేరుకున్న ఆ కుటుంబం.. ప్రధాన ద్వారం ధ్వంసమై ఉండటాన్ని చూసి నిర్ఘాంతపోయింది. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకున్నారు. రూ.25 వేల నగదు, వెండి వస్తువులు, బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయని సుబ్బారెడ్డి చెప్పారు. బీరువాలో ఉన్న సీక్రెట్ లాకర్‌లో దాచి ఉంచిన 60 సవర్ల బంగారు ఆభరణాలు భద్రంగానే ఉండటంతో సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. చోరీ ఎప్పుడు జరిగిందో తెలియలేదని, క్లూస్ టీం సాయంతో ఆధారాలు సేకరించామని పోలీసులు చెప్పారు. బాధితుడు ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదన్నారు.

వివాహిత ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): దంపతుల నడుమ విభేదాల నేపథ్యంలో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు మూలాపేట పోలీస్ క్వార్టర్స్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లాకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ నాగరాజు జిల్లాల పునర్విభజన నేపథ్యంలో నెల్లూరుకు వచ్చాడు. ఆయనకు ఇది వరకే వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. భార్య చనిపోయింది. సుమారు తొమ్మిది నెలల క్రితం పొదిలి ప్రాంతానికి చెందిన పూర్ణిమ(25)ను రెండో వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం వారు మూలాపేట పోలీస్ క్వార్టర్స్‌లో ఉంటున్నారు. కొద్దిరోజులుగా దంపతుల నడుమ విభేదాలున్నాయి. మంగళవారం పూర్ణిమ భర్తకు ఫోన్ చేయగా డ్యూటీలో ఉన్నానని చెప్పాడు. కుటుంబ సభ్యులు చూస్తుండగానే ఆమె బెడ్ రూమ్‌లోకి వెళ్లి గడియ వేసుకుని చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. క్వార్టర్స్‌లోని వారు స్థానిక వీఆర్వో మహేష్‌కు సమాచారం అందించారు. ఆయన చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి


మృతి చెందిన మహబూబ్ సుబానీ

సింగరాయకొండ: బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంట సమయంలో సింగరాయకొండ సమీపంలోని విమానాల రన్‌వేపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం జాగర్లమూడి గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ సుబానీ(35) గూడూరులోని ఓ హోటల్లో పనిచేస్తున్నాడు. ఒంగోలు వైపు నుంచి నెల్లూరు వైపు బైక్‌పై వెళ్తున్న క్రమంలో విమానాల రన్‌వేపై పోలేరమ్మ గుడి సమీపంలో ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సుబానీ తలకు తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా మరణించాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

ఇద్దరు డీజిల్ దొంగలు అరెస్ట్

టంగుటూరు: టంగుటూరు లారీ యూనియన్ ఆఫీస్ వద్ద, తూర్పునాయుడుపాలెం లారీ యూనియన్ ఆఫీస్ వద్ద ఈ నెల 7వ తేదీన డీజిల్ చోరీకి పాల్పడిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. డీజిల్ చోరీపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం కేశవారిపేట తండా గ్రామనికి చెందిన మెరజోత్ చిన్న హున్యా నాయక్, మెరజోత్ హున నాయక్‌ను నిందితులుగా గుర్తించారు. టంగుటూరులో అనుమానస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి 220 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.

గంగమ్మా.. మళ్లొస్తాం!


లాంగ్ లీవ్: వేట నిషేధంతో ఒడ్డుకు చేరుతున్న పడవలు

నడి సంద్రంలో రాకాసి అలలు ఎగసిపడుతున్నా నిర్భీతిగా వేట సాగించే మత్స్యకారులు ఒడ్డుకు చేరారు. మత్స్య సంపద వృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రెండు నెలలపాటు వేటపై నిషేధం విధిస్తుండటం తెలిసిందే. సోమవారం అర్ధరాత్రి నుంచే మొదలైన వేట నిషేధాజ్ఞలు జూన్ 15వ తేదీ వరకు కొనసాగనున్నాయి. జిల్లాలోని తీరప్రాంత గ్రామాల మత్స్యకారులు మంగళవారం ఉదయానికి బోట్లు, వలలతో సహా ఒడ్డుకు చేరారు. బోట్లను ట్రాక్టర్ల సాయంతో తీరంలోని మెరక ప్రాంతానికి చేర్చారు. వలలను సరి చేసుకుంటూ, ఇంజిన్లను భద్రపరుచుకుంటూ రోజంతా క్షణం తీరిక లేకుండా గడిపారు. 'వేటకు వెళ్లకపోతే పూట గడవదు. మత్స్యకార భరోసా ఇస్తే జీవనానికి ఇబ్బంది తప్పుతుంది. ప్రభుత్వం మాట నిలబెట్టుకుని రూ.20 వేలు ఇవ్వాలి' అని జిల్లాలోని మత్స్యకారులు కోరుతున్నారు. – సాక్షి, ఒంగోలు





బతుకు ఇంజన్ భద్రం : పడవల నుంచి ఇంజన్లను వేరు చేసి భద్రపరుచుకుంటున్న మత్స్యకారులు


'బోట్'ఫుల్ తీరం : ఒడ్డుకు చేరిన పడవలతో కళకళలాడుతున్న తీరం




ఆఖరి వేటలో చిక్కిన మత్స్యసంపదను విక్రయిస్తూ..



వలలను ఒడ్డుకు చేర్చి జాగ్రత్త చేసుకుంటున్న గంగపుత్రులు


నెట్టరనెట్టు హైలెస్సా.. ట్రాక్టర్ సాయంతో బోటు ఒడ్డుకు..